ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
గురువారం 15 మే 2025

వైసీపీకి షాక్

టీడీపీలోకి గాండ్లపెంట ఇన్‌చార్జి ఎంపీపీ



ఇన్‌చార్జి ఎంపీపీని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మే 14(ఆంధ్రజ్యోతి): గాండ్లపెంటలో వైసీపీకి షాక్ తగిలింది. ఎంపీపీ ఎన్నికల వేళ ఆ పార్టీకి చెందిన ఇన్‌చార్జి ఎంపీపీ గంగోజమ్మ టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ఆమెకు టీడీపీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 19న నిర్వహించే గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా సోమశేఖర్ రెడ్డిని ప్రకటిస్తున్నామన్నారు. వైసీపీ విధానాలు నచ్చక ఆ పార్టీ నేతలు టీడీపీలో చేరుతున్నారన్నారు. అందులో భాగంగా టీడీపీలో చేరిన ఇన్‌చార్జి ఎంపీపీ గంగోజమ్మకు సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అభ్యర్థి సోమశేఖర్ రెడ్డి, నాయకులు వెంకటరమణారెడ్డి, డైమండ్ ఇర్ఫాన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

విరివిగా రుణాలివ్వాలి: కలెక్టర్



బ్యాంకర్లు, అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మే14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బ్యాంకర్లు.. అర్హులైన రైతులు, చేనేత కార్మికులు, మహిళాసంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ వితరణ లక్ష్యంపై బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని, అర్హులైనవారికి రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. బ్యాంకర్ల భాగస్వామ్యంతో జిల్లాలో స్థిరమైన వృద్ధి సాధ్యమవుతుందన్నారు. అర్హులైన కౌలు రైతులకు కూడా రుణాలివ్వాలన్నారు. వ్యవసాయ డ్రోన్ల కొనుగోలు నిమిత్తం మహిళా సంఘాలకు చేయూతనివ్వాలన్నారు. జిల్లాలోని అన్ని బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను గడువు లోపు సాధించాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం ముందుకొచ్చే వారికి షరతులు విధించకుండా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి రోహిత్ అగర్వాల్, నాబార్డు మేనేజర్ అనురాధ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, మత్స్యశాఖ చంద్రశేఖర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ శివరంగప్రసాద్, చేనేత శాఖాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

వడగాలులపై అవగాహన కల్పించాలి

కలెక్టరేట్‌లో ఈనెల 17వ తేదీన నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా వడగాలుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి కూలీలు, పారిశుధ్య కార్మికులతో సమావేశాలు నిర్వహించి, వడగాలుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు.



- ఒక్కొక్కరికి పది నుంచి 20 వరకు టార్గెట్
- ఎండైనా ఊరూరు తిరగాల్సిందే
- లక్ష్యం చేరకపోతే ఉద్యోగం గల్లంతే
- వేసవి సెలవులు మాటే లేదు
- విధిలేక భరిస్తున్న టీచర్లు

బతకలేని బడి పంతుళ్లు..!

ప్రైవేట్ టీచర్ల మెడపై అడ్మిషన్ల కత్తి

అరకొర జీతంతో అడ్మిషన్ల భారం



జిల్లాలో 500దాకా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఇందులో 8వేల మంది దాకా ప్రైవేట్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో డిగ్రీ, పీజీ, బీఈడీ, డీఈడీ చేసినవారు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాక తప్పని పరిస్థితుల్లో కుటుంబ పోషణ కోసం అత్యధిక మంది రూఆరు వేల నుంచి రూ.10వేల జీతానికే పని చేస్తున్నారన్నారు. వీరందరికీ వేసవి సెలవులకు రెండు నెలలు ముందుగానే టార్గెట్‌లు విధించారు. సెలవులు పూర్తయ్యేలోపు టార్గెట్ పూర్తి చేయాలి. లేదంటే వేరేపని చూసుకోవచ్చని సూచిస్తున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్ ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులను వేడుకుంటున్నారు.

'మేడం..! మీరేం చేస్తారో తెలియదు. వేసవి సెలవులు ముగిసేలోపు పది అడ్మిషన్లు చేయాల్సిందే. లేదంటే మీ ఉద్యోగానికి గ్యారెంటీ ఉండదు. ఇది మేనేజ్‌మెంట్ నిర్ణయం.' ఇదీ పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో పని చేసే మహిళా ఉపాధ్యాయురాలికి ప్రిన్సిపాల్ హుకుం. దీంతో ఆమె మండు వేసవిలో అడ్మిషన్ల కోసం ఇల్లిల్లూ తిరుగుతున్నారు. అనారోగ్యానికి గురైనా లెక్క చేయక కుటుంబం గడవడం కోసం అడ్మిషన్ల కోసం అలుపెరగక పోరాడుతోంది.

'సార్...! ఈసారి మీరు పది అడ్మిషన్లు చేయాల్సిందే. లేదంటే మీకంటే తక్కువ జీతానికి పని చేసే యంగ్‌స్టర్స్ చాలామంది ఉన్నారు. ఆలోచించుకోండి.' ఇదీ ఓ ప్రైవేట్ కళాశాలలో గత పదేళ్లుగా పనిచేస్తున్న ఓ లెక్చరర్‌కు ఎదురైన అనుభవం. 'సార్..! నాకు వయసైంది. అన్ని అడ్మిషన్లు చేయలేను' అని ఆ లెక్చరర్ చెప్పారు. అన్ని చేస్తేనే ఉద్యోగం ఉంటుంది లేకుంటే లేదని చెప్పడంతో ఆయన ఉదయం లేచినప్పటి నుంచి అడ్మిషన్ల కోసం పల్లెల్లో తిరుగుతున్నారు.

పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు పదేళ్లకు పైగా పనిచేస్తున్నాడు. ఆయన ముక్కుసూటిగా వ్యవహరిస్తాడు. చదువు ఎంత చెప్పమన్నా చెప్పగలడు. కానీ అతడికి కూడా 15 అడ్మిషన్లు చేస్తేనే మిమ్మల్ని కొనసాగిస్తాం. లేదంటే మీ స్థానంలో వేరేవారిని తీసుకుంటాం. ఎందుకంటే పాఠశాల కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇది మీరు చేయాలని చెప్పారు. దీంతో ఆయన చేసేదిలేక అడ్మిషన్లు చేయించలేక ఉద్యోగమే వద్దనుకున్నాడు.

ఇది పై ముగ్గురి ఆవేదనే కాదు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరిది. స్థాయికి తగ్గట్లుగా ఉద్యోగులందరిపై అడ్మిషన్ల భారం మోపుతున్నారు. వేసవి సెలవులు ముగిసే వరకు అడ్మిషన్లు చేయరాదన్న నిబంధన ప్రభుత్వ పాఠశాలలకు వర్తిస్తుందేమో కాని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రం వేసవి సెలవులు ముగిసే సరికి హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తుంటాయి.

హిందూపురం, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో పని చేసే టీచర్లు, లెక్చరర్ల మెడపై అడ్మిషన్ల కత్తి వేలాడుతోంది. ఒక్కొక్కరు పది నుంచి 20మంది విద్యార్థులను చేర్పించాలని ఆయా విద్యా సంస్థలు టార్గెట్‌లు పెడుతున్నాయి. అరకొర జీతాలు ఇస్తూ, కట్టుబానిసల్లా ఉద్యోగులను చూస్తున్నారు. రెండో శనివారం, ఆదివారాల్లో సైతం సెలవులు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్న కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలు ప్రస్తుత వేసవి సెలవులను సైతం వారికి ఎగ్గొట్టేశాయి. పాఠాలు చెప్పే ఉద్యోగానికి తీసుకున్నా వారిని సేల్స్‌మెన్‌లాగా చూస్తూ అడ్మిషన్ల కోసం సతాయించి సంపుతున్నారని పలువురు టీచర్లు వాపోతున్నారు. ఎండలు 40 డిగ్రీలు దాటిన మండువేసవిలో అడ్మిషన్ల కోసం టీచర్లను మారుమూల పల్లెలకు సైతం తిప్పుతున్నారు. తెల్లారి లేచిన దగ్గరి నుంచి సాయంత్రం వరకు క్యాంపెయినింగ్ పేరుతో అనేకమంది టీచర్లను పల్లెల్లో తిప్పుతున్నారు. ఇందులో మహిళా టీచర్లే అధికంగా ఉండటం గమనార్హం. వేసవి సెలవులు కావడంతో తమ పిల్లలను ఇంటి వద్ద వదిలి వేయలేక వారిని కూడా వెంటబెట్టుకుని ఎండలో ఇల్లిల్లూ తిరుగుతున్నారు. అడ్మిషన్లు చేయకపోతే కాస్తోకూస్తో వచ్చే జీతం కూడా పోతుందనే భయంతో చాలా బాధను భరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చిన టార్గెట్‌లు పూర్తి చేస్తేనే వేసవి సెలవుల్లోని రెండు నెలల జీతం ఇస్తామని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు విధించాయి. దీంతో టీచర్లు ఇంటింటికీ వెళ్లి మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించండి అంటూ దీనంగా తల్లిదండ్రులను ప్రాధేయపడుతున్నారు. అడ్మిషన్ల కోసం బంధువులు, స్నేహితులను సైతం బతిమాలుతున్నారు.

లెక్చరర్లదీ అదే పరిస్థితి

పలు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో కూడా జూనియర్ లెక్చరర్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కళాశాలల యాజమాన్యాలు పదో తరగతి చదివిన విద్యార్థుల తల్లిదండ్రులు చిరునామాలు సేకరించి లెక్చరర్లను వారి ఇళ్లకు పంపుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఛీకొట్టినా విధిలేని పరిస్థితిలో వారు మీ పిల్లల్ని మా కళాశాలలో చేర్పించండి అని బతిమాలుతున్నారు. కార్మికశాఖ నిబంధనల ప్రకారం రూ.10వేలలోపు జీతాలు ఇస్తూ పది నుంచి 12గంటలపాటు ఉద్యోగం కాదు కాదు వెట్టి చాకిరీ చేయించుకుంటున్న కొన్ని కళాశాలలు పీఎఫ్, ఈఎస్ఐ లాంటి కనీస సదుపాయాలు కల్పించలేదు. దీనికితోడు మహిళా ఉపాధ్యాయులకు వేధింపులకు గురిచేస్తున్నారు.

డీఎస్సీకి చదివేదెలా?



ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చింది. వేసవి సెలవులు వచ్చాయి కదా బాగా ప్రిపేర్ అవుదామని ఎంతో మంది ప్రైవేట్ టీచర్లు ఆశించారు. అయితే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం తమ గళ్లా పెట్టె నింపుకోవడం కోసం ఆ చిరు ఉద్యోగుల మెడపై అడ్మిషన్ల కత్తి పెట్టాయి. ఉద్యోగం పోతే కుటుంబ పోషణ కష్టమవుతుందని భావించిన చాలామంది టీచర్లు ప్రిపరేషన్‌ను పక్కనబెట్టి అడ్మిషన్ల కోసం వెతుకుతున్నారు. సంబంధిత పాఠశాలలో ఒత్తిడి తెస్తుండటంతో గ్రామాల్లో తిరుగుతున్నారు. ఈ బాధలు ప్రభుత్వమో లేక జిల్లా ఉన్నతాధికారులో జోక్యం చేసుకుంటే తప్ప తీరవని బాధిత టీచర్లు పేర్కొంటున్నారు. ప్రతి ఏటా ఈ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఎవరైనా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అడ్మిషన్లు చేయాలని టార్గెట్‌లు ఇస్తే మా దృష్టికి తీసుకురావాలి. వేసవి సెలవులు ముగిసేవరకు అడ్మిషన్లు ప్రారంభించరాదు. తల్లిదండ్రులు కూడా తొందరపడి అడ్మిషన్ తీసుకోరాదు.

-గంగప్ప, ఎంఈఓ, హిందూపురం

మానసిక క్షోభ: బాబావలి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి



ప్రైవేట్ విద్యాసంస్థల్లో పోటీతత్వం నెలకొనడంతో అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠాలు బాగా చెప్పమంటే సరేగాని, అడ్మిషన్ల కోసం వేధించం ఏంటి? వేసవి సెలవుల్లో సైతం అడ్మిషన్ల కోసం తిప్పడం దారుణం. దీనివల్ల చాలా మంది మానసికంగా కుంగిపోతున్నారు. మహిళా టీచర్లను సైతం వీధుల్లో తిప్పడం ఘోరం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తు అడ్మిషన్లు చేయకూడదు. అయినా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి.



చౌటకుంటపల్లి వద్ద వేరుశనగ విత్తుతున్న దృశ్యం

- వేరుశనగ రైతుకు ఏటా నష్టాలే..
- అయినా.. పంట సాగుకు సమాయత్తం
- బీడు పెడితే పరువు పోతుందని అప్పుల సేద్యం
- పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనం అందేనా?

కౌలుకు తీసుకుని.. పంట పెట్టా



నాకున్న ఐదెకరాల పొలంలో ఏటా వేరుశగన సాగుచేస్తున్నా. సక్రమంగా పండకపోవడంతో నా భూమిలో పంట సాగు చేయలేదు. రెండెకరాల పొలం కౌలుకు తీసుకుని, వేరుశన విత్తా. రూ.50వేల వరకు ఖర్చు వచ్చింది. పంట చేతికి వచ్చేలోగా రూ.లక్ష ఖర్చవుతుంది. వర్షాలు సకాలంలో కురిసి, మేలైన దిగుబడులు వస్తే పెట్టుబడులు పోయి.. అంతోఇంతో చేతికొస్తుంది.

-రమణ, చౌటకుంటపల్లి

పరువు పంట..!

నల్లమాడ, మే 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేస్తున్న రైతులకు ఏటా నష్టాలే ఎదురవుతున్నాయి. అయినా.. ఏటా పంట పెడుతూనే ఉన్నారు. భూమిని బీడు పెడితే పరువుపోతుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో మళ్లీ అప్పులు తెచ్చి, ఆలి పుస్తెలు తాకట్టు పెట్టి పంట సాగుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ ప్రారంభానికి నెలరోజులు ముందు నుంచే రైతులకు కష్టాలు ప్రారంభమవుతాయి. ఐదారేళ్లుగా ప్రకృతి కన్నెరజేస్తూ అతివృష్టి, అనావృష్టి, తుపాన్లు తదితర వైపరీత్యాల కారణంగా అన్నదాతకు వేరుశనగ సాగులో కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదు. అయినా ఏటా పంట పెడుతూనే ఉన్నారు. ఇప్పటికే చాలామంది రైతులు విత్తనకాయలు సమకూర్చుకున్నారు. ఈసారి సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ చేస్తారా, లేదా అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బయట మార్కెట్‌లో 44 కేజీల బస్తాను రూ.3 వేలు వెచ్చించి, కొనుగోలు చేసి విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. సబ్సిడీ విత్తనకాయల పంపిణీ ఆలస్యం అవుతుండడంతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోంది. మండలంలో ఏటా 6,500 హెక్టార్లలో వేరుశనగ సాగు చేస్తున్నారు. దాదాపు 40శాతం మంది రైతులు ఇప్పటికే వేరుశనగ విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. అరకొరగా నీరు ఉన్న బోర్లకింద ఇప్పటికే కొందరు పంట పెట్టారు కూడా. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు అన్నదాతల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. ఎకరాలో పంట సాగుకు రూ.25వేలు ఖర్చవుతుంది. పంటసాగుకు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇప్పటికే అందించి ఉండుంటే చాలామంది రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేయడానికి సిద్ధమయ్యేవారు. ఎప్పుడిస్తారో తెలియక చాలామంది రైతులు అప్పులు చేసి వేరుశనగ కాయలు కొనుగోలు చేస్తున్నారు. మరికొంత మంది పెట్టుబడి సాయం అందుతుందన్న నమ్మకంతో ఇటీవల కురిసిన వర్షాలకు భూములు దుక్కిలు చేసి, విత్తడానికి సమాయత్తమవుతున్నారు. పంట పెట్టకపోతే పరువు పోతుందన్న ఉద్దేశంలో కొంతమంది రైతులు ఇళ్లలోని బంగారాన్ని బ్యాంకులో తాకట్టుపెట్టి, అప్పులు చేసి విత్తనకాయల కొనుగోలుకు సమాయత్తమవుతున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనకాయలు వెంటనే పంపిణీ చేస్తే కొంత ఊరట లభిస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

ముందుగా సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని..



నాకున్న రెండెకరాల భూమిలో వేరుశనగ సాగుచేశా. రూ.50వేలు ఖర్చయింది. 20 రోజుల క్రితమే విత్తనం వేశా. వేరుశనగ మొక్కలు పెరిగాయి. ఒకమారు కలుపు తీయించా. మంచి వర్షాలు కురిస్తే మేలైన దిగుబడి వస్తుంది. ముందుగానే పంట చేతికొస్తే మంచి ధరలు దక్కుతాయన్న ఆశతో ముందస్తుగా పంట సాగు చేశా.

-వేణుగోపాల్, చౌటకుంటపల్లి

అన్నా.. మమ్మల్ని పట్టించుకోమనండి..!



మంత్రి నారా లోకేశ్‌కు కార్యకర్తల వినతి

నేటి నుంచి మూడు రోజులు అనంతపురం జిల్లాలో లోకేశ్

(వివరాలు 7లో..)

నేడు మడకశిర చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ
- ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, సీఐ

మడకశిర/టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు కమిషనర్ రంగస్వామి బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో సీఐ నాగేష్‌బాబుతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం ఉదయం 11 గంటలకు మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని వివరించారు. ఇప్పటికే నగర పంచాయతీ పరిధిలోని 20 మంది కౌన్సిలర్లకు ప్రత్యేక సమావేశంపై సమాచారం ఇచ్చామని తెలిపారు. మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం లాంఛనమే అని తెలుస్తోంది. టీడీపీ తరుఫున ఐదుగురు కౌన్సిలర్లు విజయం సాధించగా.. వైసీపీ నుంచి 15 మంది గెలిచారు. వైసీపీకి చెందిన ఏడుగురు టీడీపీలోకి చేరగా.. ఒక కౌన్సిలర్ అక్కడే ఉండి టీడీపీ ప్రవేశ పెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నారు. ఏడుగురు కౌన్సిలర్లు వైసీపీకి మద్దతుగా ఉన్నారు. టీడీపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లతో పాటు వైసీపీకి చెందిన 8 మంది మద్దతుతో మొత్తం 13 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధం కావడంతో పాటు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఓటు కూడా టీడీపీకి కలసి రానుండడంతో అవిశ్వాస తీర్మానంలో విజయం లాంఛనమే అన్న ప్రచారం సాగుతోంది. వైసీపీ మడకశిర నగర పంచాయతీపై పూర్తిగా ఆశలు వదిలినట్లేనని ఆ పార్టీకి చెందిన కొందరు చెబుతున్నారు.



అవిశ్వాసం పై చర్చిస్తున్న కమిషనర్, సీఐ

చూసిన కనులదె భాగ్యం

- నయనానందకరంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవుడి పుష్పయాగం
- ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పూలతో పట్టణంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవుడి పుష్పయాగం నయనానందకరంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల చివరి రోజైన బుధవారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 9గంటలకు ఉభయదాతలు శ్రీ అన్నమయ్య సేవామండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య, భార్య పొరాళ్ల పద్మావతి, కుమారుడు పుండరీకాక్షతో కలిసి స్వామివారికి అనేక రకాల పూలను సమర్పించి, పుష్పయాగం చేయించారు. బంతి, చామంతి, పారిజాత, సంపంగి, సుగంధ, నీలాంబరి, కనకాంబరం, శ్రీకృష్ణతులసి, రామతులసి, గుండుమల్లి, సన్నజాతి, దవనం, గులాబీలతో స్వామికి పూజలు చేశారు. సహస్ర నామాలతో అన్నమయ్య సంకీర్తనలను అన్నమయ్య సేవాసమితి సభ్యులు ఆలపించారు. సాయంత్రం 6 గంటలకు శయనోత్సవం (ఏకాంతసేవ) కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.



చెన్నకేశవుడికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఇదేమి విచారణ..?

● వైసీపీ హయాంలో అంగన్‌వాడీలకు చేరని కోడిగుడ్లు ● 31.48 లక్షల గుడ్ల పంపిణీలో గోల్‌మాల్ ● అక్రమాలపై అప్పటి ఆర్డీవో నివేదిక ● ఇద్దరు సీడీపీవోలపై ఆరోపణలు ● వారి సమక్షంలోనే విచారణ ● ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది తీరుపై విమర్శలు


అంగన్‌వాడీ కార్యకర్తలతో విచారణ చేపట్టిన కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది

కళ్యాణదుర్గం, మే 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసిన కోడిగుడ్లను మింగేయడంపై విచారణ చేపట్టారు. 2020 సంవత్సరం కరోనా సమయంలో కోడిగుడ్ల పంపిణీలో గోల్‌మాల్ జరిగినట్లు అప్పట్లో పనిచేసిన కళ్యాణదుర్గం ఆర్డీవో నిషాంత్‌రెడ్డి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఈ నేపథ్యంలో బుధవారం కంబదూరు ఐసీడీయస్ ప్రాజెక్టును కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ మంజులవాణి, సీనియర్ అసిస్టెంట్ షెక్షావలి సందర్శించి అక్కడ పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను విచారణ చేపట్టారు. అప్పట్లో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో 31,48,805 కోడిగుడ్లు పంపిణీ చేశారు. కానీ అవి కేంద్రాలకు చేరలేదని తెలుస్తోంది. అప్పట్లో ఓ సచివాలయ మహిళా పోలీస్ అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లినప్పుడు కోడిగుడ్లు ఇవ్వలేదని చెప్పడంతో, ఆమె వెంటనే కళ్యాణదుర్గం ఆర్డీవో నిషాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన పూర్తి స్థాయిలో విచారించిన తర్వాత బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు మండలాల్లో ఉన్న 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లు పంపిణీలో తేడాలున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్‌లో నమోదుకు, అంగన్‌వాడీ కార్యకర్తల రిజిస్టర్ నమోదులో తేడాలున్నట్లు విచారణలో తేలింది. ఆయన నివేదిక ఆధారంగానే ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది విచారణ చేపట్టారు.

విచారణపై అనుమానాలు

ఆరోపణలు ఎదుర్కొంటున్న సీడీపీఓల సమక్షంలోనే విచారణ చేపట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. 200 మంది అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో రాయించుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐదు ప్రశ్నలకు ఒక్కొక్క కార్యకర్త నుంచి సమాధానాలు రాయించుకున్నారు. అప్పట్లో పనిచేసిన సీడీపీవోలు వరలక్ష్మి, వనజా అక్కమ్మ.. మీ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారా.. లేదా, కోడిగుడ్లు ఇచ్చారా.. లేదా, ఎన్నిసార్లు మీ కేంద్రాలను తనిఖీ చేశారు.. ఇలా ప్రశ్నలు ఇచ్చి సమాధానాలు రాయించుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాల్సిన అధికారులు.. కార్యాలయానికి పిలిపించుకుని సమాధానాన్ని రాయించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ఎదుటే ఆర్జేడీ కార్యాలయ అధికారులు విచారణ చేపట్టడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. లక్షల్లో కోడిగుడ్లను మాయం చేయగా.. వందల్లోనే గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించామని అధికారులు తేలికగా కొట్టిపారేస్తున్నారు. కోడిగుడ్లు ఒక్కటే కాదు పౌష్టికాహారమూ పక్కదారి పట్టించారన్న విమర్శలున్నాయి.




కొత్త యాప్‌తో ఉపాధి కూలీలకు అవస్థలు

● సర్వర్ సతాయింపుతో హాజరు అప్‌లోడ్‌కు కష్టాలు ● ప్రతిరోజూ రాత్రి 10 తర్వాతే అటెండెన్స్ ● హాజరు నమోదుకాకపోతే ఆరోజు కూలి అంతే ● సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్న కూలీలు


రాప్తాడు మండలంలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

యాప్‌సోపాలు

శింగనమల/రాప్తాడు, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో ప్రవేశపెడుతున్న నూతన విధానాలు కూలీలకు శాపంగా మారుతున్నాయి. కూలీల హాజరు వివరాలు ఏ రోజుకు ఆ రోజులోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి సర్వర్ సతాయిస్తుండటంతో ఈ దుస్థితి నెలకొంది. ఉపాధి పనికి వెళ్లిన కూలీల హాజరు వివరాలు, ఫొటో ఆ రోజు అర్ధ రాత్రి లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోతే పనులకు వెళ్లిన కూలీలకు ఆ రోజు కూలి ఖాతాలో జమ కాదు. కూలీల హాజరు వివరాలు, ఫొటో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ప్రతి రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సర్వర్ మొరాయిస్తుండటంతో కూలీలు పనులకు హాజరైనా ఒక్కో సారి వారి హాజరు వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాక కూలి అందడం లేదు. శింగనమల మండలంలోని 19 పంచాయతీల్లో 5వేల మందికి పైగా ఉపాధి పనులకు వెళుతున్నారు. అలాగే రాప్తాడు మండలంలో మొత్తం 12వేలకు పైగా జాబ్ కార్డులు ఉండగా 9 వేల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. మండల వ్యాప్తంగా ప్రస్తుతం 4 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు.



కూలీల ఆన్‌లైన్ అటెండెన్స్ అప్‌లోడ్‌కు మొరాయిస్తున్న సర్వర్

ఎన్ఎంఎంఎస్ యాప్‌తో తిప్పలు

ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో ప్రతి రోజూ కూలీల హాజరు వివరాలు, కూలీలు పని చేస్తున్న ఫొటో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రతి రోజూ ఉదయం కూలీలు పనులకు వెళ్లిన తరువాత ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశం వద్దకు వెళ్లి ఉదయం 10 గంటలలోపు కూలీలు పని చేస్తున్న ఫొటో తీయాలి. ఆ ఫొటోలో ఎంత మంది కూలీలు పని చేస్తున్నారో కనిపించేలా ఉండాలి. ఆ ఫొటోను, ఆ రోజు పనులకు హాజరైన కూలీల హాజరును అర్ధ రాత్రి 12 గంటలలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. లేదంటే ఆ రోజు కూలీలకు దిన కూలీ జమ కాదు. ఉదయం నుంచి కూలీల హాజరు అప్‌లోడ్ చేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రయత్నించినా అనేక సార్లు సర్వర్ సమస్య వలన కావడం లేదు. చాలా సార్లు రాత్రి 10 గంటల నుంచి 12 గంటల లోపు కూలీల హాజరు, ఫొటో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోందని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. కూలీల హాజరు వివరాలు అప్‌లోడ్ చేయకపోతే కూలీలకు చేసిన పనికి కూలి జమ కాదని, అలా జరిగితే కూలీలు ఉపాధి సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారని వాపోతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సమస్య ఉంది

కూలీల హాజరు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు అనేక సార్లు సర్వర్ సమస్య వస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కూలీల హాజరు, పని చేసే ఫొటో అప్‌లోడ్ చేసేందుకు అనేక సార్లు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపాం. రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉంది. త్వరలోనే పరిష్కారం అవుతుంది.

-సావిత్రి, ఏపీఓ, రాప్తాడు

రోజూ ఇబ్బందే



ఉపాధి పనులు వద్ద ఉదయం 7 గంటల నుంచి హాజరు యాప్ లో కూలీల వివరాలు నమోదు చేయడానికి ప్రతి రోజూ ఇబ్బంది తప్పడం లేదు. అప్డేట్ చేయడానికి ఉదయం పూట సం ర్వ ర్ రాకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. సర్వర్ సక్రమంగా వస్తే హాజరు నమోదుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అధికారులు సర్వర్ సమస్యను తీర్చాలి.

-దివాకర్, ఉపాధికూలీ, శింగనమల

ఈవారం సమస్యలేదు

పనులకు వెళ్లిన కూలీల వివరాలు తప్పనిసరిగా హాజరు యాప్‌లో నమోదు చేసి అప్డేట్ చేయాలి. ఈమేరకు అవగాహన కల్పించాం. అయితే గత వారం సర్వర్ సమస్యతో రాత్రి సమయంలోనే యాప్ అప్డేట్ అయింది. సోమవారం నుంచి పనులు వద్దనే సర్వర్ రావడంతో అప్డేట్‌ను కూలీలు నమోదు చేస్తున్నారు.

-తలారి దామోదర్, ఇన్‌చార్జ్ ఏపీఓ

కవర్ కాని షెడ్..!

చీనీ మార్కెట్‌లో ఆగిన కవర్ షెడ్ నిర్మాణం
ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని వైనం
మండుటెండలోనే చీనీకాయల నిల్వ
కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడమే కారణం

అనంతపురం రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): చీనీ మార్కెట్‌లో కవర్ షెడ్ నిర్మాణం మళ్లీ ఆగిపోయింది. నెలల్లో పూర్తి కావాల్సింది, ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే ఉండిపోయింది. కాంట్రాక్టర్‌కు బిల్లుల మంజూరులో జరుగుతున్న జాప్యమే ఇందుకు ప్రధాన కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. షెడ్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు, వ్యాపారులు మార్కెట్‌కు వచ్చే చీనీ దిగుబడులను మండుటెండలో ఉంచుతున్నారు.

వైసీపీ హయాంలో నిర్మాణ చర్యలు..

యార్డులోని చీనీ మార్కెట్‌కు రోజు రోజుకు చీనీ దిగుబడులు ఎక్కువగా వస్తుండటంతో ఆదాయం కూడా బాగానే సమకూరుతోంది. ఈక్రమంలో మరో షెడ్ నిర్మాణం చేపట్టాని నిర్ణయించారు. ఆమేరకు వైసీపీ ప్రభుత్వంలో కవర్ షెడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తొలత రూ.2.10కోట్లతో నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఆమేరకు టెండర్లు పిలిచి తిరుమల కన్‌స్ట్రక్షన్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. అప్పటి ప్రజాప్రతినిధులు, పాలక వర్గసభ్యులు నిర్మాణాన్ని ప్రారంభించారు. అప్పట్లోనే చీనీ సీజన్ ప్రారంభంలోపు షెడ్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి


ఆగిపోయిన షెడ్ నిర్మాణం


చీనీ కుప్పలను వరిగడ్డితో కప్పిన దృశ్యం

పనులు ప్రారంభించారు. ఇదంతా జరిగి ఇప్పటికి మూడేళ్లు కావస్తోంది. షెడ్ నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ప్రారంభం నుంచి పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.

బిల్లు రాకపోవడమే కారణమా?

షెడ్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు కాకపోవడంతోనే పనులు ఆపేసినట్లు సమాచారం. గత మూడేళ్లగా షెడ్ నిర్మాణ పనులకు సంబంధించి ఒక్క రూపాయి కూడా కాంట్రాక్టర్ ఖాతాల్లో జమ కానట్లు తెలిసింది. ఈక్రమంలోనే పనులు నిలిపేసినట్లు తెలుస్తోంది. ఏడాది


మార్కెట్‌లో అసంపూర్తిగా కనిపిస్తున్న కవర్ షెడ్

కిందట అప్పటి యార్డు కార్యదర్శి జయలక్ష్మి రూ.1.34కోట్ల బిల్లులు చెల్లింపులకు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే బిల్లులు మాత్రం కాంట్రాక్టర్ ఖాతాలోకి జమకాని పరిస్థితి. ఈక్రమంలోనే షెడ్ నిర్మాణం పూర్తి చేయకుండా నిలిపేసినట్లు తెలుస్తోంది.

ఎండలోనే చీనీకాయలు..

చీనీ సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటింది. దిగుబడులు బాగుండటంతో ఆశించిన దానికంటే ఎక్కువగానే మార్కెట్‌కు కాయలు వస్తున్నాయి. మార్కెట్‌లో చీనీ కాయలను కుప్పలుగా పోసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాత షెడ్, కొంత పూర్తయిన షెడ్లలో కుప్పలు పోస్తున్నారు. అయితే ఆ స్థలం సరిపోవడం లేదు. దీంతో కాయలను మండుటెండలోనే కుప్పలుగా పోస్తున్నారు. కాయలు ఎండకు దెబ్బతినకుండా ఉండేందుకు వరిగడ్డిని కప్పుతున్నారు. షెడ్ నిర్మాణం పూర్తయితే ఈ అవస్థలు ఉండేవీ కాదని రైతులు, వ్యాపారులు అంటున్నారు. షెడ్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందోనని రైతులు, వ్యాపారులు ఎదురుచూస్తున్నారు.

బిల్లు పెండింగ్ వల్లే..

చీనీ మార్కెట్‌లో కవర్ షెడ్డు నిర్మాణ బాధ్యతలు తిరుమల కన్‌స్ట్రక్షన్ ఇచ్చారు. అయితే యార్డులోని కవర్ షెడ్ నిర్మాణంతోపాటు షాపింగ్ రూమ్‌ల నిర్మాణాలకు సంబంధించి రూ.3కోట్లు కాంట్రాక్టర్‌కు బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్ పనులు చేయకుండా నిలిపివేశాడు.

-రఘునాథ్, డీఈ, ఇంజనీరింగ్ విభాగం, మార్కెటింగ్ శాఖ

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు



అనంతపురం క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే ఉపేక్షించేది లేదనీ, చర్యలు తప్పవని అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కేశవనాయుడు స్పష్టంచేశారు. రీసర్వే, మిగులు భూములు తదితర అంశాలపై ఆర్డీఓతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ప్రశ్న: భూవివాదాల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నారు?

ఆర్డీఓ: భూముల వివాద అంశంలో ఇరువర్గాలతో మాట్లాడతాం. పట్టా భూములకు సంబంధించి డాక్యుమెంట్ ప్రకారం విచారించి, అర్హులకు న్యాయం చేస్తున్నాం. అసైన్డ్‌భూముల్లో సాగులో ఎవరున్నారనేది పరిశీలిస్తాం. డాక్యుమెంట్ ప్రకారం క్షేత్రస్థాయిలో లేనివారికి నోటీసులిస్తున్నాం.

ప్రశ్న: రీసర్వే ఎంతవరకు వచ్చింది?

ఆర్డీఓ: ప్రస్తుతం మండలానికో గ్రామం పైలెట్‌గా తీసుకుని, రీసర్వే చేస్తున్నాం. తర్వాత మిగిలిన గ్రామాల్లోనూ చేపడతాం. రీసర్వేలో ప్రధానంగా వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్, భూముల వివాదంపైనే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. గతంలో జరిగిన పొరబాట్ల కారణంగా వెబ్‌ల్యాండ్ ఫైల్స్ వస్తున్నాయి. వాటిలోనూ కొన్ని కేసులు పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: పుట్లూరులో సోలార్ కోసం ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారా..?

ఆర్డీఓ: పుట్లూరు మండలంలో సోలార్ కోసం 124 ఎకరాలు తీసుకున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై సర్వేచేసి విచారణ చేయించాం. అందులో 6.6 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నట్లు తేలింది. సంబంధిత వ్యక్తులకు నోటీసులిచ్చాం. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మిగులు భూముల పరిస్థితి ఏంటి?

ఆర్డీఓ: డివిజన్ పరిధిలో మా పరిశీలనలో పుట్లూరు, యల్లనూరు మండలాల్లో మిగులు భూములు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఎవరైనా సంబంధిత పత్రాలతో వస్తే వాటిని పరిశీలించి, జేసీకి పంపుతాం. పట్టా భూములకు డాక్యుమెంట్లు కీలకమవుతాయి.

ప్రశ్న: మిగులు భూముల విషయంలో కిందిస్థాయి నుంచి నివేదిక సరిగా ఉండటం లేదనే విమర్శ ఉంది..?

ఆర్డీఓ: అలాంటిదేమీ లేదు. ఇప్పటివరకు అనంతపురం డివిజన్ పరిధిలో దాదాపు 40 నుంచి 50 ఎకరాల మిగులు భూమికి సంబంధించి 15 కేసుల వరకు పరిష్కారం చూపాం. తహసీల్దార్ కార్యాలయాల నుంచి వాటి ఫైల్ రాగానే.. సమగ్రంగా పరిశీలించి కలెక్టరేట్‌కు పంపుతున్నాం. డాక్యుమెంట్లు సరిగా పొందుపరచాల్సి ఉంటుంది.

ప్రశ్న: ల్యాండ్ కన్వర్షన్ ఇతర ఫైళ్ల విషయంలో డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ఎలా స్పందిస్తారు...?

ఆర్డీఓ: ల్యాండ్ కన్వర్షన్‌కు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేస్తున్నారు. ఏ ఫైల్ విషయంలోనూ డబ్బు వసూలు చేయడం లేదు. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

అప్పుల ఉరికి రైతు బలి


రవి యాదవ్ (ఫైల్)

విడపనకల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో వి. కొత్తకోట గ్రామానికి చెందిన రైతు రవి యదవ్(27)లు బుధవారం ఆత్మ హత్య చేసుకున్నాడు. విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపిన మేరకు వి. కొత్తకోట గ్రామానికి చెందిన రవి యాదవ్ తన 8 ఎకరాల పొలంతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. పంట పండక, గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయాడు. ఇదే విషయాన్ని తల్లి ప్రమీలమ్మ వద్ద చెప్పి మథనపడేవాడు. పంట సాగు కోసం చేసిన అప్పులు దాదాపుగా రూ.8లక్షలకు చేరాయి. వాటికి వడ్డీలు పెరిగి పోవటం, అప్పు తీర్చే మార్గం కానరాకపోవడంతో బుధవారం తెల్లవారు జామున ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. తెల్లారినా కొడుకు తన గదిలో నుంచి ఎంత సేపటికి బయటకు రాక పోవటంతో అనుమానం వచ్చిన తల్లి ప్రమీల గది తలుపులు తెరిచి చూసింది. విగతజీవిగా ఉరికి వేలాడుతున్న కుమారుడు కనిపించడంతో బోరున విలపించింది. విడపనకల్లు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. కాగా మృతుడు రవికి ఇంకా వివాహం కాలేదు. ఈయన తండ్రి గోవిందు కొన్నేళ్ల కిందటే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి ప్రమీల, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తెను పెంచి పెద్ద వాళ్లను చేసింది. పెద్ద కుమారుడుకి, కూతురికి వివాహాలు చేసింది. పెద్ద కుమారుడు ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటుండగా వి.కొత్తకోటలో తల్లి చిన్న కుమారుడు మాత్రమే ఉండేవారు అని స్థానికులు తెలిపారు.

సారోళ్లు ఎప్పుడొస్తారో..?

● గ్రామాల్లో సచివాలయాలు వెలవెల ● పర్యవేక్షణ అంతంత మాత్రమే ● ప్రజలకు తప్పని ఎదురుచూపులు

బొమ్మనహాళ్, మే 14(ఆంధ్రజ్యోతి): నిత్యం గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సచివాలయ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి నెలకొంది. బొమ్మనహాళ్ మండలంలోని గ్రామ సచివాలయాలు మొక్కుబడిగా నడుస్తున్నాయి. వాటిలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. సమయ పాలన పాటించడం లేదు. వివిధ పేర్లతో విధులకు డుమ్మా కొడుతున్నారు. బుధవారం మండలంలోని దర్గాహొన్నూరు, కల్లదేవనహళ్లి, దేవగిరి గ్రామాల్లోని సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసిన సందర్భంగా కనిపించిన దృశ్యాలే ఇందుకు నిదర్శనం. ఒక్కో సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీ పర్యవేక్షణలో రెవెన్యూ, సర్వేయర్, సంక్షేమ, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్యుత్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇలా పలుశాఖల సిబ్బందిని నియమించారు. వారి పనితీరు, పర్యవేక్షణ అంతా గందరగోళంగా ఉంది. ఉదయం 10.30 గంటలకు దర్గాహొన్నూరు గ్రామ సచివాలయం-2కు వెళ్లగా.. వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. తర్వాత మహిళా పోలీసు వచ్చారు. గ్రామంలోని సచివాలయం-1కు 11 గంటలకు వెళ్లగా.. అక్కడ మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. సెక్రటరీ ఎక్కడ అని వారిని విచారిస్తే మండల కేంద్రానికి వెళ్లారని సమాధానం ఇచ్చారు. మండల కేంద్రానికి వెళ్లకుండా బుధవారం విధులకు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. గోవిందవాడ సచివాలయం-2కు మధ్యాహ్నం 12 గంటలకు వెళ్లగా.. ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో, వెటర్నరి అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగతా సిబ్బందిపై ఆరాతీస్తే సమాధానం రాలేదు. దేవగిరి గ్రామ సచివాలయానికి మధ్యాహ్నం 12.30 గంటలకు వెళితే అక్కడ సిబ్బంది ఎవరూ లేరు. వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు కనిపించారు. కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఉదయం 10 గంటల నుంచి ఎదురు చూస్తున్నామని, అధికారులు ఎవరూ రాలేదని అక్కడ ఉన్న మీనాక్షమ్మ, శ్రీరాములు, లేపాక్షి తెలిపారు. ఆంధ్రజ్యోతి విజిట్‌తో గ్రామ సచివాలయ విధులకు సిబ్బంది సరిగ్గా రావడం లేదని వారి బాగోతం బయటపడింది. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డుల కోసం నిత్యం గ్రామీణులు వస్తున్నారు. సిబ్బంది సరిగా రాలేదని, సమయపాలన అసలే లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.


ఆంధ్రజ్యోతి విజిట్
దేవగిరిలో ఖాళీగా కనిపిస్తున్న సిబ్బంది కుర్చీలు, పనులు కోసం వచ్చిన స్థానికులు

ఇన్‌సర్వీస్ టీచర్లకు అన్యాయం చేయొద్దు

● డీఈఓకు సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, మే 14(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఇన్ సర్వీస్ టీచర్లకు అన్యాయం జరక్కుండా చూడాలని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈఓను కోరారు. శారదా స్కూల్‌లో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు, ఇన్ సర్వీసు టీచర్లు డీఈఓ ప్రసాద్‌బాబును బుధవారం కలిశారు. ఉమ్మడి జిల్లాలోని జడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులు చాలామంది ఇన్‌సర్వీస్ బీఈడీ చేస్తున్నారని తెలిపారు. బదిలీల సమయంలో వాళ్ల పనిచేసే స్థానాలను క్లియర్ వేకెన్సీలుగా చూపడం సరికాదన్నారు. దీని వల్ల ఆ ఉపాధ్యాయులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎనిమిదేళ్లు పూర్తయిన వారికి, రేషనలైజేషన్‌కు గురైన వారికి ప్రస్తుత బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమణారెడ్డి, రామాంజినేయులు, లింగమయ్య, సురేష్ కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రేపట్నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్/ధర్మవరం మే14(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో యువతకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తున్నామని పినాక ప్రజా సాధికార ట్రస్టు తెలిపింది. ఈ నెల 16 నుంచి జూన్ 5 వరకు 21 రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజనం, దూర ప్రాంత విద్యార్థులకు వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. **శ్రీసత్యసాయి జిల్లావారికి ధర్మవరం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశపురంలో ఉన్న యశోద స్కూల్‌లో శిక్షణ ఇస్తారని పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఉచిత** రిజిస్ట్రేషన్ కోసం 9182776002 నంబరులో సంప్రదించాలని సూచించారు. అనంతపురం జిల్లావారికి అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న రాజహంస గెస్‌హౌస్‌లోని జిల్లా కురుబ సంఘం కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం 7337523013 నంబరులో సంప్రదించాలని సూచించారు. **శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం 9గంటల సాయంత్రం 5గంటల వరకు ఉంటాయని తెలిపారు.**

ఎందుకంటే..

ప్రపంచ అనుసంధానకర్తగా ఆంగ్ల భాష ముఖ్య భూమిక పోషిస్తోంది. పరస్పరం విజ్ఞానాన్ని పంచుకోవాలన్నా, నూతన విషయాలను తెలుసుకోవాలన్నా, అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నా ఇంగ్లిష్ నేర్చుకోవాల్సిందే. అందుకే డిగ్రీ, పీజీ, బీటెక్ విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణా తగతులు నిర్వహిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్‌తోపాటు కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులపైనా ఉచితంగా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వీటిపై పట్టులేక అనేక మంది విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్ మొదలగు పోటీ పరీక్షల్లో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఐఆర్ఎస్ బి.యాదగిరి, పినాక సంస్థను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఆంత్రాక్స్‌తో గొర్రెల మృతి

కూడేరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో ఆంత్రాక్స్ వ్యాధి బయటపడింది. గత వారం రోజులుగా ఆంత్రాక్స్ వ్యాధితో 10 వరకూ మూగజీవాలు మృతి చెందడం కలకలం రేపుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంత్రాక్స్ వ్యాధి బయటపడటంతో పశు వైద్యులు అప్రమత్తమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మూగ జీవాలు ఆరోగ్యంపై సచివాలయ సిబ్బంది ఆరా తీయాలని పశు వైద్యాధికారి శ్రీనివాసులు ఆదేశించారు. ఎక్కడైన వ్యాధులతో మూగ జీవాలు బాధపడుతుంటే తక్షణం చికిత్స అందించాలని తెలిపారు. ఆంత్రాక్స్ వ్యాధి సోకిన మూగ జీవాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా కాల్చడం, లేక పూడ్చడం చేయాలని, వ్యాధి సోకిన వాటిని తింటే రోగాలు వస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.



కియ ఉద్యోగి ఆత్మహత్య


గౌరీప్రసాద్ (ఫైల్)

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్‌టీ వీధికి చెందిన కావలి ఉమాశంకర్ కుమారుడు, కియ ఉద్యోగి కావలి గౌరీప్రసాద్ (25) గురువారం విషద్రావకం తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కావలి గౌరీప్రసాద్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు ఆపేసి, కియ కార్ల కంపెనీలో ఉద్యోగానికి చేరాడు. పనిభారంతో ఒత్తిడికి లోనవుతున్నాననీ, చనిపోతానని కుటుంబ సభ్యులతో అంటుండేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం గౌరీప్రసాద్.. అన్న పృథ్వీరాజ్‌కు ఫోన్ చేసి, చనిపోతున్నానని చెప్పాడు. ఇంట్లోనే విషద్రావకం తాగాడు. పృథ్వీరాజ్, అతడి తండ్రి ఉమాశంకర్ వెంటనే ఇంటికి రాగా.. అప్పటికే అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీలు ఆపి వసూళ్లు... పలువురి అరెస్టు

కదిరి, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణం గుండా వెళ్లే లారీలను ఆపి వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలో కొంతమంది లారీలను ఆపి, తాము ఎమ్మెల్యే మనుషులమనీ, ఆయన ఆఫీసులో పని చేస్తున్నామని చెప్పి డబ్బు వసూలు చేస్తున్నారు. విషయం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి వచ్చింది. విషయాన్ని ఆయన.. పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు నిఘా పెట్టి, పలువురిని పట్టుకున్నారు. వీరిలో కొంతమంది టీడీపీ సానుభూతిపరులు, నకిలీ విలేకరులు, వివిధ సంఘాల్లో పనిచేస్తున్నామని చెప్పుకునే మరికొంతమంది ఉన్నారని సీఐ తెలిపారు. వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, బైండోవర్ చేశామన్నారు. కోర్టులో హాజరు పరిచామన్నారు. ఇలాగే కొనసాగితే కఠిన చర్యలుంటాయని సీఐ హెచ్చరించారు.

రాత్రి పది గంటలకే షాపులు మూసేయాలి

రాత్రి పది గంటలకు వ్యాపార సముదాయాలను మూసివేయాలని సీఐ నారాయణరెడ్డి.. దుకాణదారులకు సూచించారు. ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నా.. కొంతమంది బార్లు, మందుషాపుల వద్ద ఉండి, ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బుధవారం రాత్రి నుంచి అలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టి, కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

అనంతపురం న్యూటౌన్ మే 14 (ఆంధ్రజ్యోతి): బెళుగుప్ప సచివాలయం-1 డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్రను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. లబ్ధిదారులకు మే 1న పింఛన్ పంపిణీ చేయకపోవడం, పింఛన్ రూ.2,58,000లతో పరారవడం, విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఆ ఉద్యోగిపై బెళుగుప్ప పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజిలెన్స్ తనిఖీ

అనంతపురం న్యూటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ క్రాస్, హెచ్చెల్సీ బ్రిడ్జి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో 28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నారు. బియ్యం యజమాని ఎల్లప్ప, డ్రైవర్ లక్ష్మణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో డీసీటీఓ సురేష్‌కుమార్, సీఎస్‌డీటీ లక్ష్మీకాంతనాయక్, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మీసేవ కేంద్రంలో చోరీ

రూ.1.5 లక్షలు అపహరణ

గార్లదిన్నె, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంకు ఎదురుగా ఉన్న మీసేవ కేంద్రంలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. రూ.1.50 లక్షలు అపహరించారు. మండల కేంద్రానికి చెందిన సోమశేఖర్ రెడ్డి కెనరా బ్యాంకు ఎదురుగా గదిని అద్దెకు తీసుకుని, మీసేవ కేంద్రం నిర్వహిస్తున్నాడు. రోజూ వచ్చే ఆదాయాన్ని సెంటర్‌లోనే దాచుకునేవాడు. మంగళవారం కూడా మీసేవ సెంటర్ ఆదాయాన్ని అందులోనే ఉంచి, తాళాలు వేసుకుని, ఇంటికెళ్లాడు. రాత్రి మొహాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు మీసేవ కేంద్రాలు తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. అందులోని రూ.1.50 లక్షల నగదు అపహరించారు. బుధవారం ఉదయం మీసేవ కేంద్రాన్ని ఓపెన్ చేసేందుకు నిర్వాహకుడు సోమశేఖర్ రెడ్డి వచ్చి చూడగా.. తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచాం ఇచ్చాడు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా మీసేవ కేంద్రాన్ని పరిశీలించారు. సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. చోరీపై కేసు నమోదు చేసుకుని, దొంగలను పట్టుకునేందుకు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి గవర్నర్, మంత్రి


అధికారులతో సమీక్షిస్తున్న వీసీ

అనంతపురం సెంట్రల్, మే 14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నట్లు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. స్నాతకోత్సవం నిర్వహణపై బుధవారం అధికారులతో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య సమీక్షించారు. వీసీ మాట్లాడుతూ.. ఈనెల 17న జేఎన్టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో 14వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కమిటీలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పనులు పూర్తయ్యేలా పర్యవేక్షిస్తామన్నారు. ఈ వేడుకల్లో డాక్టర్ సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వీసీ పేర్కొన్నారు.

అన్నా.. మమ్మల్ని పట్టించుకోమనండి..!

మంత్రి నారా లోకేశ్‌కు కార్యకర్తల వినతి
నేటి నుంచి మూడు రోజులు జిల్లాలోనే లోకేశ్



అనంతపురం మే 14(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో అవమానాలకు ఓర్చాం.. ఇబ్బందులు పడ్డాం. అక్రమ కేసులలో జైలుకు వెళ్లాం. పోలీసుల నిర్బంధాన్ని చూశాం. అయినా ఎత్తిన పసుపు జెండాను దించలేదు. పార్టీ అధికారంలోకి రావాలని ఎదురొడ్డి పోరాడాము. అధికారం లేకపోతే నాయకుల ఇళ్ల మీద జెండాలు మారుతాయేమోగానీ.. కార్యకర్త ఇంటిపై పసుపు జెండా నిరంతరం రెపరెపలాడుతూనే ఉంటుంది. ప్రజాప్రతినిధులు మాజీలు అవుతారేమోగానీ.. కార్యకర్తలు ఎప్పటికీ మాజీలు కారు. పార్టీ అధికారంలోకి రావాలని ఆంక్షలకు ఎదురీది... ఆకాంక్ష నెరవేరే వరకూ శ్రమించాం. ఇప్పుడైనా మమ్మల్ని పట్టించుకోమని నాయకులకు చెప్పండన్నా.. లోకేశన్నా..' అని తెలుగుదేశం కార్యకర్తలు విన్నవిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న కొందరు నాయకులు, కార్యకర్తలకు ఇప్పటికీ ప్రాధాన్యం దక్కలేదనే ఆవేదన వారిలో కనిపిస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చిందనే ఆనందం ఒకవైపు ఉన్నా.. గుర్తింపు దక్కలేదన్న వేదన ఆ వర్గాలను వెంటాడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను స్వీప్ చేసినా... మెజార్టీ నియోజకవర్గాల్లో ఆది నుంచి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరగలేదనే అభిప్రాయం ఉంది. స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ పోస్టుల భర్తీ, చిన్న చిన్న కాంట్రాక్టు పనులు.. ఇలా అనేక అంశాల్లో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు కాకుండా... అనుయాయులకు, ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

బలం అంటున్నారేగానీ..

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని ప్రతి వేదికపైనా అంటారే గాని, క్షేత్ర స్థాయిలో తమను అలా చూడటం లేదని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి జవసత్వాలను ఇచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏ లాభం ఆశించకుండా, పార్టీ అధికారంలోకి రావాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో పనిచేశారు. నేతలు పిలుపునిస్తే.. వందలాదిగా తరలివస్తున్నారు. ఇది కేవలం పార్టీమీదున్న అభిమానం అనడంలో ఎలాంటి సందేహం లేదు. తమతో మంత్రి నారా లోకేశ్ సమావేశం అవుతారన్న సమాచారం కార్యకర్తలలో ఎంతో ఉత్సాహాన్ని నింపుతోంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ కార్యకర్తల సమావేశంలోనైనా వారి ఆవేదన ఆలకించి, న్యాయం చేస్తారనే ఆశతో ఆ వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

మూడు రోజుల పర్యటన

మంత్రి నారా లోకేశ్ జిల్లాలో మూడు రోజులపాటు పర్యటించనున్నారు. ప్రకాశం జిల్లాలో పర్యటన ముగించుకుని, హెలికాప్టర్‌లో బయలుదేరి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు గుత్తి మండలం బేతాపల్లికి చేరుకుంటారు. గుత్తి పట్టణ శివారులోని మాసినేని స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన విడిది శిబిరంలో మధ్యాహ్నం 2 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఆ రోజు రాత్రికి అక్కడే బస చేస్తారు. రెండో రోజు, 16న ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు బేతాపల్లిలో రూ.22వేల కోట్లతో చేపట్టిన రెన్యూ ప్రాజెక్టుకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు అనంతపురంలోని జీఎంఆర్ కాంపౌండ్‌లో నిర్వహిస్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూతురు వివాహానికి హాజరవుతారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంవైఆర్ కళ్యాణమండపంలో విశ్రాంతి తీసుకుంటారు. ఆ రోజు రాత్రికి అక్కడే బస చేస్తారు. మూడో రోజు17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో మంత్రి పాల్గొంటారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారు.

బాలికల హవా

పాలిసెట్‌లో సత్తా
ఉమ్మడి జిల్లాలో 93.45 శాతం ఉత్తీర్ణత
తొలిసారిగా వాట్సాప్‌లో ఫలితాలు


హారికా మోహన్


భానుప్రకాష్


మొహమ్మద్ అస్లాం


ప్రణీతరెడ్డి


తేజేంద్ర


శెట్టి బ్రాహ్మణి

అనంతపురం సెంట్రల్, మే 14(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్-2025 ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి జిల్లా 93.45 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 12,601 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 11,776 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 93.45గా నమోదైంది. 5,073మంది బాలికలకుగాను 4,833 మంది ఉత్తీర్ణులయ్యారు. 7,528 మంది బాలురకుగాను 6,943 మంది పాసయ్యారు. దీంతో బాలికలు 95.27, బాలురు 92.23 శాతం ఉత్తీర్ణత సాధించారు.

టాపర్లు వీరే..

గణితం, భౌతిక, రసాయన శాస్త్రం సబ్జెక్టులపై 120 మార్కులకు పాలిసెట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో అనంతపురం జిల్లా నుంచి నిమ్మనపల్లి హారికా మోహన్, తమ్మినేని భానుప్రకాష్ 119 చొప్పున, పగిడి మొహమ్మద్ అస్లాం 118 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి వన్నా ప్రణీతరెడ్డి, ఎం.తేజేంద్ర 117 చొప్పున, శెట్టి బ్రాహ్మణి 115 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

వాట్సా్‌ప్‌లో ఫలితాలు...

విభాగాల వారీగా సంబంధిత ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సేవలను పొందాల్సి వచ్చేది. ఇదే తరహాలోనే ఫలితాలు కూడా పరీక్షల నిర్వహణ విభాగాల వెబ్‌పోర్టల్‌లో చూసుకోవాల్సి వచ్చేది. అన్ని రకాల పౌరసేవలను ఒకే వేదికపై పొందేలా రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ పాలనను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలిసారిగా పాలిసెట్-2025 ఫలితాలను వాట్సాప్ ద్వారా విద్యార్థులకు అందించింది. విద్యార్థులు వారి మొబైల్ నుంచి 9552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్‌ను పెట్టి, పాలిసెట్ రిజల్ట్ ఆప్షన్ ద్వారా వారి ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకున్నారు. కాగా కౌన్సెలింగ్ నిర్వహణ తేదీలను త్వరలోనే వెల్లడించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఆలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగొందాలి

వీహెచ్‌పీ అఖిల భారత కార్యదర్శి రాఘవులు


మాట్లాడుతున్న వీహెచ్‌పీ అఖిల భారత కార్యదర్శి రాఘవులు

అనంతపురం కల్చరల్, మే 14(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగొందాలని వీహెచ్‌పీ అఖిల భారత కార్యదర్శి రాఘవులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం మినీ కల్యాణమండపంలో బుధవారం అర్చక సమాఖ్య నాయకులతో కలిసి రాఘవులు మాట్లాడారు. ఆలయాలకు ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. మతమార్పిడులు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో అర్చకులు.. ప్రజల ఇళ్ల వద్దకెళ్లి ఆధ్యాత్మిక బోధన చేసే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేవాలయానికి వచ్చే భక్తుల ద్వారా అర్చకులు హరినామ సంకీర్తన, వారితో పూజలు చేయించాలన్నారు. తద్వారా హిందూధర్మాన్ని కాపాడినవారవుతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు, ఆకులేడు తిరుపతయ్య, మల్లికాముల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మారుతిప్రసాద్, శ్రీనివాసులు, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రమణబాబు, కార్యదర్శి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి

ప్రజల్లో చైతన్యం రావాలి: కలెక్టర్
అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్


మాక్‌డ్రిల్‌లో భాగంగా విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేలా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజహంస అపార్ట్‌మెంట్‌లో జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అన్ని శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. మాక్‌డ్రిల్‌కు కలెక్టర్ హాజరై స్థానికులకు తగిన సూచనలు చేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేపట్టిన మాక్‌డ్రిల్‌కు అనుగుణంగా.. ఏదైనా విపత్తు ఎదురైతే ధైర్యంగా ఎదుర్కొనేలా ఉండాలని తెలిపారు. సంక్షోభం ఎదురైనప్పుడు ఎలాంటి పరిస్థితులను ఏ విధంగా సురక్షితంగా బయట పడాలన్న దాన్ని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. అపార్ట్‌మెంట్‌లో విపత్తు ఎదురైనప్పుడు మానవ నష్టాలు వాటిల్లే అవకాశం ఉందన్నారు. సైరన్ మోగితే ఎలాంటి చర్యలు చేపట్టాలన్నది వివరించారు. ఆకస్మాత్తుగా ఎదురయ్యే విపత్తులకు పరికరాలు అందుబాటులో లేకపోయినా ప్రత్యామ్నాయ పరికరాలు వినియోగించే బయట పడాలని సూచించారు. మాక్ డ్రిల్‌పై మరింత అవగాహన పెంచేలా క్విజ్‌పోటీలు నిర్వహిస్తామని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ఇస్తామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీజ్ ఫైర్ ఉన్నా సరే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు చేపట్టినప్పుడు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎం అండ్‌హెచ్ఓ ఈబీ దేవి, సూపరింటెండెంట్ యోగేశ్వరిదేవి, తహసీల్దార్ హరిప్రసాద్, ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాసులు, డాక్టర్ నారాయణస్వామి, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ అంబికా సోదరి అంత్యక్రియలు పూర్తి

గుంతకల్లు టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎంపీ అంబికా సోదరి వేదవతి (48) అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈనెల 8న గంగోత్రి యాత్రలో హెలీక్యాప్టర్ ప్రమాదంలో వేదవతి మరణించగా.. ఆమె భర్త ముష్టూరు భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం ఉదయం వేదవతి మృతదేహాన్ని స్థానిక హనుమేష్ నగర్‌లో వారి ఇంటికి తీసుకొచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బంధువులు, సంబంధీకుల సందర్శనకు ఉంచారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జితేంద్రగౌడ్, వెంకటరామిరెడ్డి, ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం, సింగవరం రవి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బంధువులు.. వేదవతి భౌతికకాయంపై పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మధ్యాహ్నం మండలంలోని నెలగొండ గ్రామ సమీపంలో గల ముష్టూరు భాస్కర్ ఫాంహౌస్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు

బీపీఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) పరీక్షల ఫలితాలను బుధవారం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీపీఈడీ విద్యార్థులకు మార్చిలో ప్రథమ, తృతీయ సెమిస్టర్ రెగ్యులర్, సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రథమ సెమిస్టర్‌లో 61మందికి గాను 45 మంది, తృతీయ సెమిస్టర్‌లో 70మందికి గాను 58మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఫెయిలయిన విద్యార్థులకు రీవాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఈనెల 30లోపు రూ.500 చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

కణేకల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన ఎల్లప్ప(52) అనే రైతు బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇంటి పైకప్పు కోసం ఎల్లప్ప గ్రామ సమీపంలోని ఓ గుంతలో పెరిగే జమ్మును కోసుకునేందుకు వెళ్లాడు. సమీప ప్రాంతం నుంచి విద్యుత్ ప్రవాహం జరగడంతో గుంతలో జమ్ము కోస్తున్న ఎల్లప్పకు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఆయన అక్కకక్కడే మృతి చెందాడు. ఎల్లప్పకు శరీరంలోని పలు భాగాలలో గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎల్లప్ప మృతితో భార్య సుంకమ్మతో పాటు ఐదుగురు సంతానం అనాథలుగా మిగిలారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు


ఆస్పత్రి ఆవరణలో విలపిస్తున్న బాలుడి తల్లి


దినేష్ కుమార్‌రెడ్డి (ఫైల్)

కదిరి, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మౌనిక థియేటర్ సర్కిల్ వద్ద బుధవారం సైకిల్‌ను వెనుకవైపు నుంచి ఆటో ఢీకొట్టడంతో బాలుడు దినేష్‌కుమార్ రెడ్డి (10) మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కుమ్మర వీధికి చెందిన నారాయణరెడ్డి కుమారుడు దినేష్‌కుమార్ రెడ్డి ఐదో తరగతి చదువుతుండేవాడు. ట్యూషన్‌కు సైకిల్‌పై వెళ్లి వస్తుండగా మౌనిక థియేటర్ సర్కిల్ వద్ద వెనుకవైపు నుంచి ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని తండ్రి నారాయణరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కుమారుడి మృతితో ఆస్పత్రి ఆవరణలో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బావిలో యువకుడి గల్లంతు

రాయదుర్గం, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుగ్గిలమ్మ గుడి వద్దనున్న బావిలో బుధవారం ఈతకెళ్లి యువకుడు రాజశేఖర్(30) గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆస్పత్రి వెనుక వీధిలో ఉంటున్న రాజశేఖర్ టైలర్ పని చేస్తుండేవాడు. మధ్యాహ్నం సరదాగా స్నేహితులతో కలిసి దుగ్గిలమ్మ గుడి వద్దనున్న బావిలోకి ఈతకెళ్లాడు. అందులో గల్లంతయ్యాడు. స్నేహితులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బావి వద్దకు చేరుకుని, గాలింపు చర్యలు చేపడుతున్నారు. రాజశేఖర్‌కు భార్య రాధ, ఇద్దరు కుమారులున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

కళ్యాణదుర్గం రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపాన బుధవారం పిడుగుపాటుకు గొర్రెల కాపరి రామలింగ (40) మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామలింగ.. గొర్రెలను మేపునకు అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. ఉరుములతో కూడిన వర్షం రావడంతో ఓ చెట్టు కిందకు వెళ్లాడు. చెట్టుపై పిడుగు పడడంతో రామలింగ అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల పొలాల్లోని రైతులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రామలింగ మృతదేహాన్ని చూసి అతడి భార్య అశ్విని బోరున విలపించింది. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

గుత్తి, మే 14(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలోని పగడిరాయి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (45) లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. రైల్వే ట్రాక్ పక్కన కాలువలో మృతదేహం పడి ఉందన్నారు. ఆ వ్యక్తి ఎలా చనిపోయడన్నది వివరాలు తెలియరాలేదన్నారు. రైల్లో నుంచి జారీ పడి కాలువలో పడి మృతి చెందాడా, ఎవరైనా ఇక్కడ తెచ్చి పడేశారా అన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూవివాదంలో టీడీపీ కార్యకర్తపై దాడి

పొలంలో పంపుసెట్ పైపుల ధ్వంసం


చికిత్స పొందుతున్న చారిక పాలయ్య

గుమ్మఘట్ట, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగేదొడ్డి గ్రామంలో భూవివాదంతో టీడీపీ కార్యకర్త చారిక పాలయ్యపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. మంగళవారం సాయంత్రం పొలంలో భూ తగాదాలతో చారిక పాలయ్యపై గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పూల తిప్పేస్వామి, మంజునాథ, గోవిందు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన పాలయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం రాత్రి పాలయ్య పొలంలో పంపుసెట్, మోటారుపైపులు, వైర్లు పూర్తిగా ధ్వంసం చేసి దహనం చేశారు. ఘటనపై రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, గుమ్మఘట్ట ఎస్‌ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ. 31 వేలు

అనంతపురం రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌లో చీనీ కాయల ధరలు కాస్త పెరిగాయి. ఇంత వరకు టన్ను గరిష్ఠ ధర రూ. 30వేలు దాటలేదు. బుధవారం చీనికాయలు టన్ను గరిష్ఠంగా రూ. 31,200 పలికాయి. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు.

న్యూస్ బాక్స్

మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి


ముజఫర్ అలీ (ఫైల్)

కదిరి, మే 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ చైర్మన్ ముజఫర్ అలీ (60) అనారోగ్యంతో బుధవారం మరణించారు. మున్సిపల్ చైర్మన్‌గా ముజఫర్ అలీ ఐదేళ్ల పాటు కొనసాగారు. ఆయన తండ్రి నిజాంవలీ మంత్రిగా, ఎమ్మెల్యేగా సేవలు అందించారు. నిజాంవలీ కుమారుడు ముజఫర్ అలీ కాంగ్రెస్‌లో ఉండి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నివాళ్లు అర్పించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

తనకల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణనాయక్ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. సాయం కోరుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి రూ.25,584 మంజూరు కావడంతో ఆ చెక్కును తెలుగు యువత మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, పట్టణ మైనార్టీ నాయకుడు బాబు బుధవారం అతనికి అందించారు.

దరఖాస్తు చేసుకోండి

తనకల్లు, మే14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో అర్హులైన రైతులు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఓ మరియమ్మ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఐదు ఎకరాల లోపు కలిగిన రైతులు అర్హులని, వివిధ రకాల పండ్ల, పూల మొక్కలు పెంచుకోవడానికి అవకాశముందని అన్నారు. మూడేళ్ల పాటు సంరక్షణకు, మొక్కలకు నీటికి సహకారం అందిస్తామన్నారు. దరఖాస్తులను ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఉపాధి కార్యాలయంలో అందించాలన్నారు.

గుర్తింపు కార్డుల కోసం..

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసే వారు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక సచివాలయంలో వీధి వ్యాపారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ గుర్తింపు కార్డు వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడమే కాకుండా పలు సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 15,16 తేదీల్లో దరఖాస్తులను సచివాలయంలోని సంక్షేమ అధికారికి అందజేయాలన్నారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఓటరు ఐడీ, నివాస ధ్రువీకరణ పత్రం, ఫొటో దరఖాస్తుకు జత చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చీమల రామాంజి, గడ్డం సూరి, అమర్నాథ్ చౌదరి, డీలర్ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాల తనిఖీ

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను డీఐఈఓ సయ్యద్‌మౌలా బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, కళాశాలలో గదులు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించారని విద్యార్థినులను అభినందించారు. ఆయన వెంట డీఈసీ మెంబర్లు రామరాజు, చెన్నకేశవులు, శ్రీనివాసులు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని మంగళగిరి సమీపంలో ఆత్మకూరు విద్యాభవన్ వద్ద శుక్రవారం నిర్వహించే రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు.

పట్టు రైతులకు అవగాహన

నల్లమాడ, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుటాలపల్లిలో పట్టురైతులకు ఆ శాఖ అధికారులు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పట్టుపరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటస్వామినాయక్ మాట్లాడుతూ.. మల్బరీ సాగుచేసే రైతులకు ప్రస్తుత ప్రభుత్వం మంచి రాయితీలు ఇస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు షెడ్‌కు రూ.41వేలు, మొక్కలు నాటడానికి ఎకరాకు రూ.22500, ఓసీకి రూ.37వేలు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టుపరిశ్రమ అధికారి మస్తాన్, టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, రైతులు పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారం

నంబులపూలకుంట, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ తూపల్లి రహదారి సమస్యను బుధవారం అధికారులు పరిష్కరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి ఆ గ్రామస్థులు ఈ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఆ గ్రామానికెళ్లి రైతులతో అధికారులు చర్చించారు. ఎస్పీకుంట, పెడబల్లి రోడ్డు నుంచి ఎగువ తూపల్లి గ్రామం వరకు రహదారికి రైతులతో చర్చించి సమస్య పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎస్ఐ వలీబాషా; మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు, రమణారెడ్డి, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తనకల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొళ్లవారిపల్లి సమీపంలో బుధవారం జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.51,620 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎస్ఐతోపాటు పోలీసులు ఓబులేసు, ఆంజి, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తి రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): నల్లమాడలోని ఓ హోటల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 63 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పుట్టపర్తి ఎక్సైజ్ సీఐ నాగరాజు బుధవారం తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసే క్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించిన నాలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌బాబు, ప్రసాద్, నాగభూషణం, పోలీసులు అల్లాబక్స్, నరసింహారెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికపై సమావేశం

గాండ్లపెంట, మే 14(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఎన్నికలపై అధికారులతో ఎన్నికలాధికారి విజయప్రసాద్ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. 19న జరిగే ఎంపీపీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందులో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అమీర్ పాల్గొన్నారు.

17న సర్వసభ్య సమావేశం

పుట్టపర్తిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు వారి వారి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులకు శిక్షణ

ధర్మవరంరూరల్, మే14(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం యోగాసనాలు, సూర్యనమస్కారాలు, తెలుగు కథలు, నృత్యంపై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు స్పోకన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, క్విజ్‌పోటీలు, చదరంగం తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఇద్దేవాండ్లపల్లిలో తాగునీటి కష్టాలు

- పది రోజులుగా పనిచేయని బోరు
- తీవ్ర ఇబ్బందుల్లో పాడిరైతులు
- పొలాలను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు


పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు


మరమ్మతులకు నోచుకోని పంచాయతీ బోరు

అమడగూరు (కదిరి), మే 14(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని ఇద్దేవాండ్లపల్లిలో పది రోజుల క్రితం పంచాయతీ బోరు చెడిపోవడంతో ఆ గ్రామస్థులు తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో దాదాపు 90 కుటుంబాలున్నాయి. వీరంతా పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఒక్కో ఇంటికి రెండు, మూడు పాడి ఆవులున్నాయి. ఒక్కొక్క ఆవుకు రోజుకు 20 బిందెల దాకా నీరు అవసరం. ఇన్ని నీళ్లను సమీప పొలాలకు వెళ్లి తెచ్చుకోవడానికి పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది వ్యవసాయ బోర్ల వద్దకు నీటి కోసం వెళ్లితే రానివ్వడంలేదని వాపోయారు. దీంతో పాటు గ్రామంలో పైపులైన్ సమస్య కూడా ఉందని అన్నారు. అధికారులు స్పందించి మోటారు, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి.. ఈ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుమియాను వివరణ కోరగా.. 'ఆరునెలల క్రితమే కొత్త మెటారు, స్టార్ ఏర్పాటు చేశాం. మోటార్‌కు వారెంటీ ఉండడంతో కంపెనీకి పంపాం. రెండు, మూడు రోజుల్లో వస్తుంది. రాగానే మోటారు ఏర్పాటు చేస్తాం. కొత్త పైపులైన్లకు నివేదికలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పైపులైన్ వేయించి సమస్య లేకుండా చూస్తాం' అని అన్నారు.


కలెక్టరేట్‌లో కలెక్టర్, జాయ్‌లుక్కాస్ కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే

పుట్టపర్తి అభివృద్ధికి చేయూతనివ్వండి

కార్పొరేట్ సంస్థలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వినతి

పుట్టపర్తిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టే అభివృద్ధి పనులకు సామాజిక బాధ్యతగా చేయూతనివ్వాలని పలు కార్పొరేట్ సంస్థలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. బుధవారం పుడా, మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలను జాయ్‌లుకాస్ కంపెనీ ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కలెక్టర్ టీఎస్ చేతన్, జాయ్‌లుకాస్ కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై చర్చించారు. పుట్టపర్తి పర్యాటకరంగ అభివృద్ధికి తగిన నిధులిస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పర్యాటక అధికారి నరసయ్య, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కదిరి అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి కార్మిక హక్కులను హరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, రామమోహన్, యూటీఎఫ్ నేత శ్రీనివాసులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మాబున్నీషా, సువర్ణ, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు యాకుబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు తిరుపాల్, జనార్ధన్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఓబుళదేవరచెరువు, మే 14(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణపై బుధవారం స్థానిక వారపు సంతలో జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎమ్మార్‌డీఎస్ సరోజమ్మ కళాబృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారిభాను ప్రకాష్‌నాయక్, జనజాగృతి మేనేజర్ శ్రీనివాసులు, ఏఓఆర్‌డబ్ల్యు శిల్ప, శ్రీవాణి, నిర్మల, ప్రసన్న, నారాయణమ్మ పాల్గొన్నారు.

పందులను ఇంటి వద్దనే పెంచుకోవాలి

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): పందులు వీధుల్లో వదిలేయకుండా.. వాటి యజమానులు వారి వారి ఇళ్ల వద్దనే పెంచుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పందుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో చాలా ప్రాంతాల్లో పందులు అధికంగా తిరుగుతున్నాయని, వాటి వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వారం రోజులు గడువు ఇస్తున్నామని, అనంతరం పట్టణంలో పందులు కనిపిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాముస్, కేశవ పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనరసింహులు



అమడగూరు (కదిరి), మే14(ఆంధ్రజ్యోతి): అమడగూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ జిల్లా దేవనకొండ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఈయన ఉద్యోగోన్నతి పొంది.. బదిలీపై ఇక్కడి వచ్చారు.

కనెక్షన్ మార్చారు... స్తంభం వదిలేశారు..


వీధిలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

నల్లచెరువు(కదిరి), మే 14 (ఆంధ్రజ్యోతి): నల్లచెరువులోని వీవర్స్ కాలనీలోని ఓ వీధిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు. కాలనీ ఏర్పాటైన కొత్తల్లో విద్యుత్ శాఖ అధికారులు ఓ విద్యుత్ స్తంభాన్ని రోడ్డు అ డ్డంగా ఏర్పాటు చేశారు. రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చినా.... ఇబ్బందులు పడుతున్నామని, ఆ స్తంభాన్ని మార్చాలని ఆ కాలనీ వాసులు పలుమార్లు కోరారు. అయి నా ఆ అధికారులు పట్టించుకోలే దు. మూడు నెలల క్రితం ఆ వీధు లో సీసీ రోడ్డు వేశారు. ఇప్పటికైనా ఆ స్తంభాన్ని తొలగిస్తారని ఆ కాలనీ వాసులు ఆశించారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు ఆ స్తంభానికి ఉన్న విద్యుత్ కనెక్షన్లను మరో స్తంభాన్ని ఏర్పాటు చేసి.. దానికి మార్చారే తప్ప .. ఆ స్తంభాన్ని మాత్రం అలాగే ఉంచారు. వినియోగంలో లేని ఆ విద్యుత్ స్తంభాన్ని ఇకనైనా తొలగించాలని, పలు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. దీనిపై వివరణ కోసం ఏఈ, డీఈ, ఏడీలను సెల్‌ఫోన్‌లో సంప్రదించగా.. వారు స్పందించలేదు.

విద్యుత్ తీగలను సరిచేసిన సిబ్బంది



విద్యుత్ వైర్ల ఎత్తు పెంచిన అధికారులు

ఓబుళదేవరచెరువు, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీకాలనీ సమీపంలోని నీటి ట్యాంక్ వద్ద విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో ఉన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఈ నెల 10న ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన విద్యుత్‌శాఖ ఏడీ ఓబులేసు ఆ ప్రాంతంలో మరో స్తంభాన్ని ఏర్పాటు చేసి.. ఆ తీగలు ఎత్తులో ఏర్పాటు చేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో జైన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ


భవిత, సుల్తానా, సర్థాకౌసర్, హర్షాద్, లాస్యప్రియ

కదిరి అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని జైన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కె.భవిత 539, సుల్తానా 534, సర్థాకౌసర్ 511, హర్షాద్ 508, లాస్యప్రియ 501 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను పాఠశాల యజమాన్యం, సిబ్బంది అభినందించారు.

నాలుగురోజులు నీటి సరఫరా బంద్

కదిరి, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే చిత్రావతి రిజర్వాయర్ వద్ద మోటార్లు చెడిపోవడంతో నాలుగు రోజుల పాటు నీటి సరఫరా ఉండబోదని కమిషనర్ కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

పుట్టపర్తిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు సిద్ధమైన ఓ యువకుడిని కొత్తచెరువు పోలీసులు రక్షించారు. వారు తెలిపిన మేరకు ... కొత్తచెరువు బీసీ కాలనీకి చెందిన ఓ యువకుడు తన ప్రేమ వ్యవహారంలో ఏర్పడ్డ సమస్యతో మనస్తాపం చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో స్నేహితులకు పంపాడు. ఇది జిల్లా ఎస్పీ దృష్టికి వెళ్లడంతో ఆమె పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్‌ను అప్రమత్తం చేసి, కొత్తచెరువు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ జగదీష్ సంకేతిక సహాయంతో యువకుడి లొకేషన్ ట్రేస్ చేశాడు. ఆమేరకు హుటాహుటిన పెనుకొండ రహదారిలో ఉన్న రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కొత్తచెరువు బీసీ కాలనీలో అతడి తల్లిదండ్రులకు అప్పగించినట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

కంపచెట్లను తొలగించండి


జాతీయ రహదారిపైకి వచ్చిన కంపచెట్లు

కదిరి అర్బన్, మే14(ఆంధ్రజ్యోతి): కదిరి-అనంతపురం జాతీయ రహదారిలో టోల్‌ప్లాజా సమీపంలో కంపచెట్లు పెరిగి రోడ్డు బార్డర్ లైన్ వరకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. ఇది జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ద్విచక్రవాహనదారులు బార్డర్ లైన్‌కు వెలుపలే ప్రయాణించాల్సి ఉంది. కంపచెట్లు పెరగడంతో.. బైక్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు మొదలైతే కంపచెట్లు మరింత ఏపుగా పెరిగి రోడ్డును ఆక్రమించే ప్రమాదముందని, సంబంధితాధికారులు ఆ కంపచెట్లును తొలగించేలా చర్యలు తీసుకోవాలని ద్విచక్రవాహనదారులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


అయ్యప్పస్వామి విగ్రహం

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవనగర్‌లో అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున మహాగణపతి, సుబ్రమణేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, మహాలక్ష్మీ, నవరత్నలింగ, నవగ్రహమూర్తుల సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. అదేవిధంగా హోమాలు, యజ్ఞాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీటీడీ దేవస్థాన అగమ సలహదారుడు పరదరాజన్ విజయ్ స్వామి, గురువుస్వాములు విజయ్‌కుమార్, జయప్రకాశ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నేత హరీశ్‌బాబు, అయ్యప్ప స్వామి మాలదారులు, భక్తులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


స్వామివారిని చక్రస్నానానికి తీసుకెళ్తున్న అర్చకులు

కొత్తచెరువు, మే 14(ఆంధ్రజ్యోతి): సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం స్వామి వారికి నిర్వహించిన చక్రస్నానంతో ముగిశాయని ఆలయ పురోహితులు వికటకవి సాయినాథ్ తెలిపారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజ్, పణి, నాగరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. సంఘమేశ్వరుడికి వసంతోత్సవం, పుష్పయాగం, ఊంజల్‌సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


ప్రతిష్ఠించిన విగ్రహాలు, హోమం చేస్తున్న పండితులు

నల్లమాడ, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోముగుట్టపల్లిలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో కొత్తగా రామాలయం నిర్మించారు. సీతారాముల విగ్రహాలను వేదపండింతులు ప్రతిష్ఠించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక హోమాలు చేపట్టారు.

రేపట్నుంచి గంగాభవాని ఉత్సవాలు


పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు

గాండ్లపెంట, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక గంగాభవాని ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు 17వ వార్షికోత్సవం, తిరునాళ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం అందుకు సంబంధించిన పోస్టర్ ఆ ఆలయంలో ఆవిష్కరించిన వారు మాట్లాడారు. శుక్రవారం కలిశ పూజ, అభిషేకం, అలంకరణ, అష్టోతరం, సాయంత్రం కుంకుమార్చాన, రాత్రికి చెక్కభజన, శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, కోలాటం, నూనె దీపాలతో ఊరేగింపు, రాత్రి తొమ్మిది గంటలకు భక్తి పాటల ఆర్కెస్ట్రా, ఆదివారం తెల్లవారుజామున రెండుగంటల నుంచి జ్యోతులు, బోనాలు, సాయంత్రం మూడు గంటల నుంచి ఉట్ల తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నటరాజ్, మల్లికార్జున, మహేష్, ఓబులరెడ్డి, ఆనంద్, రవీంద్రారెడ్డి, లక్ష్మీనరసింహగౌడ్, మధు పాల్గొన్నారు.

అమ్మవారికి తాంబూలాలు


అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకెళ్తున్న భక్తులు

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మశాలీయుల ఆడపడచు అయిన మహాలక్ష్మీకి పద్మశాలీయ సంఘం సభ్యులు.. పసుపు, కుంకుమ, తాంబూలాలు బుధవారం సాయంత్రం సమర్పించారు. భద్రవతి భావన రుషీంద్రగుడి తరఫున చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపు రోజున శయనోత్సవం సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి చీర సారె సమర్పించారు.

ఆధునిక వ్యయసాయంపై అవగాహన

పుట్టపర్తి రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లిలో రైతులకు ఆధునిక వ్యవసాయంపై తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం అవగాహన కల్పించారు. పెనుకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు స్వయంప్రభాకర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన పలితాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య, తిరుపతి వ్యవసాయ కళాశాల అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గిణేష్‌కుమార్ పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సమష్టిగా పనిచేయండి

ఎమినిటీ కార్యదర్శులకు మున్సిపల్ చైర్మన్ ఆదేశాలు



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, ఎమ్మెల్యే పీఏ

హిందూపురం, మే14(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి సచివాలయంలో పని చేసే ఎమినిటీస్ కార్యదర్శులు సమష్టిగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమినిటీస్ కార్యదర్శులతో కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పీఏ వీరయ్య మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి రూ.92.50కోట్ల నిధులు విడుదలకు జీఓ విడుదలైందన్నారు. ఈ పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. దీంతో అన్ని వార్డుల్లో ప్రజాప్రతినిధులు, నాయకులతో వార్డులను సందర్శించి అత్యవసరమైన రహదారులు, కాలువలు పనులు ఎక్కడెక్కడ చేపట్టాలో తెలియజేయాలన్నారు. కొన్ని వార్డుల్లో ఇతర నిధులతో రోడ్డు పూర్తీఅయి ఉంటే వాటిని మినహాయించి కొత్త వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సీసీ రోడ్లు, కాలువలు, లైటింగ్ తదితర ప్రతిపాదనలు వెంటనే తెలుపాలన్నారు. సమావేశంలో డీఈలు వాణి, ఆనంద్‌రాజు, జనార్దన్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలను చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణ నీటివిభాగం పంప్‌హౌస్‌లో పనిచేస్తున్న 25మంది కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదునెలల జీతాలు చెల్లించాలని ఏఐటీయుసీ జిల్లా నాయకులు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు జరగడం ఇబ్బందిగా మారిందన్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించి ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యాలు కల్పించాలన్నారు కార్మికులను ఆప్కాస్ విధానంతో తీసుకెళ్లి రెగ్యులర్ జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు బాబు, మారుతిరెడ్డి, వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంజు, ఉమేష్, రాజు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో ఎక్సైజ్ డీసీ తనిఖీ



చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డీసీ

హిందూపురం, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలో తూమకుంట చెక్‌పోస్టులో ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తనిఖీ చేశారు. బుధవారం హిందూపురానికి వచ్చిన ఆయన స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక మద్యం, అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలు త్వరగా క్లియర్ చేయాలన్నారు. కల్లు దుకాణాల నుంచి శ్యాంపుల్స్ తీసి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపించాలన్నారు. కల్తీ అరికట్టేలా కల్లు విక్రేతలకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా వచ్చే మద్యాన్ని అరికట్టాలన్నారు. పాత ముద్దాయిలు, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. రెండు అంతకు మించి కేసులుంటే పీడియాక్ట్ నమోదు చేయాలన్నారు. అనంతరం తూమకుంట చెక్‌పోస్టువద్ద స్టేషన్‌ను తనిఖీచేసి కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం సరఫరాచేసినా విక్రయించినా వారిపై పీడియాక్ట్ నమోదు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం సీఐ, ఎస్ఐ సిబ్బందితో మాట్లాడుతూ కర్ణాటక మద్యం సరఫరాను అరికట్టాలన్నారు. సమావేశంలో సీఐ సృజన్‌బాబు, ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

రొళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): నూతన మండల పరిషత్ అధికారిగా నాగేశ్వర్ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేస్తానన్నారు.

అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు

మండల కేంద్రంలోని మీసేవ కేంద్రంలో రెవెన్యూ సంబంధిత సేవల కోసం ఆదాయ, కుల ధృవీకరణ, భూములకు సంబంధించిన వివరాలు తదితర సేవలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం అందిందని ఎంపీడీఓ అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తే మీసేవ కేంద్రాన్ని మూసివేస్తామని ఎంపీడీఓ హెచ్చరించారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడిగా వడ్డె సురేష్

సోమందేపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా రెండోసారి వడ్డె సురేష్ ఎన్నికయ్యారు. మంగళవారం రాత్రి మంత్రి సవిత ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పట్టణ అధ్యక్షుల ఎంపిక జరిగింది. వడ్డె సురేష్‌కు పట్టణ అధ్యక్ష పదవి దక్కింది. దీంతో స్థానిక నాయకులు నీరుగంటి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రెండోసారి అధ్యక్షునిగా ఎంపిక చేసిన మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకోసం అహర్నిషలు కష్టపడతానని, పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు.



వడ్డె సురేష్‌ను అభినందిస్తున్న నాయకులు

అసంపూర్తిగా ఆర్బీకేల నిర్మాణం

నిధులు విడుదల చేయని గత ప్రభుత్వం

కమ్యూనిటీ, మహిళా సంఘాల భవనాల్లో నిర్వహణ

అద్దె భవనాల్లో 21 కేంద్రాలు



ఆమిదాలగొందిలో మొండిగోడలకే పరిమితమై కేంద్రం



బుళ్లసముద్రంలో అద్దె భవనంలో రైతు సేవా కేంద్రం

మడకశిర రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): రైతులు దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులను అందించాలన్న లక్ష్యంలో గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లను ఏర్పాటుచేసింది. వాటి కోసం ప్రత్యేక భవన నిర్మాణాలు చేపట్టింది. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.21.80 లక్షలు కేటాయించింది. మొదటి విడత నిధులు విడుదల చేశారు. ఆ నిధులతో భవన నిర్మాణ పనులు చేశారు. తరువాత నిధులు విడుదల కాకపోవడంతో భవనాలు వివిధ దశల్లోనే ఆగిపోయాయి. దీంతో చేసేది లేక అద్దె భవనాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

వసతుల్లేక తిప్పలు

నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, రొళ్ల, అగళి, గుడిబండ మండలాల్లో 71 రైతు భరోసా కేంద్రాలున్నాయి. పంచాయతీ కేంద్రాల్లోని కమ్యూనిటీ, మహిళా సంఘాల భవనాల్లో రైతు భరోసా కేంద్రాలను కూడా నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక 21 కేంద్రాలను మాత్రం అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. మండలంలో బుళ్లసముద్రం, భక్తరహళ్లి, గంగుళవాయిపాళ్యం, సీ కోడిగేపల్లి, గౌడనహళ్ళి, ఛత్రం, గోవిందాపురం, వైబీ హళ్లి, ఆమిదాలగొంది, చందకచర్ల, కల్లుమర్రి, మెళవాయి తదితర ప్రాంతాల్లోని కేంద్రాలు వైసీపీ పాలనలో నిధుల కొరతతో ఆగిపోయాయి. అర్ధంతరంగా ఆగిన కేంద్రాలను ప్రభుత్వం పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది



వైసీపీ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. రైతులకు చేసిన మేలు ఏమీ లేదు. నాయకులు గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసింది లేదు. ఇది చేస్తాం.. అదిచేస్తాం.. అని ఆశ చూపారే తప్ప ఆచరణలో సాధ్యం కాలేదు. ఆమిదాలగొందిలో రైతు భరోసా కేంద్రం మొండిగోలకే పరిమితమైంది.

-గిరి, రైతు, టీడీ పల్లి

ఇప్పటికీ అద్దె చెల్లిస్తున్నాం

మడకశిర నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. 21 భవనాలకు సంబంధించి ఇప్పటికీ అద్దె చెలిస్తున్నాం.

-తిమ్మప్ప, ఏఓ, మడకశిర

సకాలంలో వేతనాలు చెల్లించాలి

లోచర్ల గ్రామ సచివాలయం వద్ద కూలీల ధర్నా



వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి కూలీలు

పెనుకొండ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): సకాలంలో ఉపాధికూలీల వేతనాలు చెల్లించాలని కూలీలు డిమాండ్ చేశారు. బుధవార రొద్దం మండలంలోని లోచర్ల గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం పెద్దన్న ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు సచివాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఉపాధికూలీలు, బిల్లులు ఇచ్చేవరకు కదిలే ప్రసక్తేలేదని సచివాలయం వద్ద భైఠాయించారు. ఈసందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఆరు వారాలుగా ఉపాధి బిల్లులు అందలేదన్నారు. పనిచేసిన ప్రదేశంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు వేయకపోవడంతో వారానికి రూ.700నుంచి రూ.900మాత్రమే కూలి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పనిచేసిన కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఆరు రోజులు పనిచేస్తే నాలుగైదు రోజులే మస్టర్‌లో అటెండెన్స్ వేస్తున్నారన్నారు. మూడు వారాలవుతున్నా పేస్లిప్‌లు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఆరునెలల నుంచి బిల్లులు రాకపోవడంతో కుటుంబాల భారం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేస్లిప్‌లు రెండు మూడ్రోజుల్లో పంపిణీ చేస్తామని, కూలీల సమక్షంలో కొలతలు వేయడానికి చర్యలు తీసుకుంటామని ఏపీఓ సూర్యనారాయణ హామీ ఇచ్చారు. దీంతో కూలీలు ధర్నా విరమించారు. అనంతరం గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పెద్దన్న, నారాయణ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మడకశిర టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈనెల 9 నుంచి స్వామివారి బ్రహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం చివరిరోజు కావడంతో ఉదయం నుంచి స్వామివారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. వసంతోత్సవం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, శ్రీవారి శయనోత్సవ కార్యక్రమాలను ఘనంగా జరిపారు, చివరిరోజు కావడంతో పరిసరగ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఐముక్తేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనుకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాచీన ఆలయమైన ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు కన్నాస్వామి, మూర్తిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారికి వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మార్కెట్ బాబును పరామర్శిస్తున్న తిప్పేస్వామి

మడకశిర టౌన్/రూరల్, మే14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తడకలపల్లి గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. హిందూపురం నుంచి మడకశిరకు టీడీపీ నాయకులు మార్కెట్‌బాబు, అమానుల్లా ద్విచక్రవాహనంలో వస్తున్నారు. తడకలపల్లి ఆగ్రోస్ ఫాం వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి వారిని పరామర్శించారు. వారి పరిస్థితి విషమించడంతో మార్కెట్‌బాబును తుమకూరుకు తరలించగా.. అమానుల్లాను హిందూపురానికి తరలించారు. కాగా అమానుల్లా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామనికి చెందిన లోకేశ్‌నాయక్ (18) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లోకేశ్ నాయక్ తిరుపతిలోని గోశాలలో పనిచేస్తున్నాడు. వారం రోజులు క్రితం స్వగ్రామానికి వచ్చి ఇక పనికి వెళ్లనని తల్లిదండ్రులతో చెప్పాడు. వారు మందలించడంతో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయండి

పెనుకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): అంగనవాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలపై ఈనెల 20న అసంఘటిత కార్మికులు చేపడుతున్న దేశవ్యాప్తసమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు నాయకులు కోరారు. ఈ సందర్భంగా అంగనవాడీ కార్యకర్తలు సీడీపీఓ శాంతలక్ష్మీకి సమ్మె నోటీసు అందించారు. బుధవారం సీఐటీయు నాయకులు బాబావలి, అంగనవాడీ యూనియన్ నాయకురాలు బావమ్మ, అంగనవాడీ కార్యకర్తలు వినతిని అందిస్తూ అంగనవాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్న డిమాండ్లపై సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు.

పశువులను రోడ్డుపై వదిలితే కేసులు

పెనుకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ రోడ్లపై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని వీటి ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పశువులను రోడ్లపై ఉంచితే పశువుల యజమానులను జరిమానాతోపాటు కేసులు నమోదుచేస్తామని కమిషనర్ సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే పశువులను నగర పంచాయతీ కార్యాలయానికి తరలించామన్నారు. మళ్లి రోడ్లపై వదిలితే వాటిని గోశాలలకు తరలిస్తామని తెలిపారు. పశువుల యజమానులు నగర పంచాయతీకి సహకరించాలని కోరారు.


షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

అగళి, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. పీ బ్యాడిగెర నివాసి హనుమంతరాయప్ప హెడిహళ్లి పొలిమేరలో తనకు ఉన్న మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం సాగుచేయడానికి బోరుబావి వేయించుకున్నాడు. పక్కనే ఒక గుడిసె వేసుకుని అందులో స్టార్టర్ బిగించుకున్నాడు. ఆ గుడిసెలో డ్రిప్ పరికరాలు, పండించిన ఉల్లిగడ్డలు బస్తాలు నిల్వ ఉంచాడు. బుధవారం ఉదయం 7 గంటలకు ఉన్నట్టుండి వ్యవసాయ రైతులకు అందించే త్రిఫేస్ విద్యుత్ సరఫరా అందించినప్పుడు రెండు మూడుసార్లు విద్యుత్ పోయిరావడం వల్ల షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెలో మంటలు చెలరగాయి. దీంతో గుడిసెలో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.30వేలు ఆస్తినష్టం జరిగింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

అదృశ్యమైన బాలిక అప్పగింత

పెనుకొండ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో అదృశ్యమైన బాలిక వివాహం చేసుకుని బుధవారం ప్రత్యక్షమైంది. విజయవాడలో చదువుతున్న బాలిక, సెలవులకు ఇంటికి వచ్చి రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. దీంతో తల్లిదండ్రులు కియ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక బెంగళూరుకు వెళ్లి తాను ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకుని స్వగ్రామానికి తిరిగి వచ్చింది. మైనర్ కావడంతో ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐ రాజేష్ తెలిపారు.

మామిడిచెట్ల నరికివేత



లేపాక్షి, మే 14(ఆంధ్రజ్యోతి): తన పొలంలోని మామిడి చెట్లను నరికివేశారని రైతు ముక్తియార్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండున్నర ఎకరాల్లో రైతు మామిడిపంటను సాగుచేశాడు. లేపాక్షి గ్రామానికి చెందిన కొంతమంది ఆదివారం ముక్తియార్‌తో గొడవపడ్డారు. బుధవారం పొలానికి వెళ్లగా మామిడిచెట్లను నరికివేశారు. తనతో గొడవపడ్డవారే చెట్లను నరికివేశారని దర్యాప్తు చేయాలన్న రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

ఎంపీపీ గీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గీత

పెనుకొండ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ భానురేఖ, ఎంపీపీ గీత సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గీత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధశాఖల అధికారులు పాల్గొని అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో చెరువుల్లో రైతులు, వ్యాపారస్తులు చెరువు మట్టిని తరలించేందుకు ఇబ్బందిగా ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వంలో రైతులు ఉచితంగా మట్టి తరలించుకోవచ్చన్నారు. ఇటుకలభట్టి వ్యాపారులు చెరువుల్లో మట్టి తరలించేందుకు ముందుగా తహసీల్దార్‌తో అనుమతులు పొంది క్యూబిక్ మీటరు రూ.150 చలానా కట్టి ఇరిగేషన్ అనుమతులతో తరలించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజునాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ సూర్యనారాయణ, ఏపీఓ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చట

బస్టాండువైపు వెళ్లని బస్సులు



వృథాగా మారిన ఆర్టీసీ బస్టాండు

సోమందేపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు ఉపయోగంలోకి వచ్చిందని సంబరపడేలోపు మూడురోజుల ముచ్చటగా ముగిసింది. 25ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు సేవలను సంబంధిత అధికారులు మూడు రోజుల క్రితం పునరుద్ధరించారు. బస్సులన్నీ బస్టాండుకు వచ్చివెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఏమైందో తెలియదు కానీ ప్రస్తుతం అటువైపు బస్సులు వెళ్లడం లేదు. కథ మొదటికి వచ్చింది. బస్టాండు వృథాగా మారింది. పూర్తిస్థాయి సేవలు ఇప్పట్లో అందేలా లేవని ప్రయాణీకులు అంటున్నారు.

ఆర్థిక సంఘం భేటీకి పురం మున్సిపల్ చైర్మన్

హిందూపురం, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం స్థానిక సంస్థల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 16వ ఆర్థిక సంఘం సమావేశానికి హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ హాజరుకానున్నారు. తిరుపతిలో గురువారం ఒక రోజు జరిగే ఆర్థిక సంఘం సమావేశానికి రాయలసీమ నుంచి రమేష్ ఒక్కరే ఎంపిక అయ్యారు. సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం బయలుదేరి తిరుపతికి వెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర టౌన్, మే14(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రభుత్వ ఎస్.వై.టీ.ఆర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడ్‌యాప్ సంయుక్తంగా పుట్టుగొడుగుల పెంపకం, టైలరింగ్ కోర్సులపై ఉచిత శిక్షణ నిర్వహిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్లను అందివ్వడం జరుగుతుందని, 15 సంవత్సరాల వయస్సు నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వారు శిక్షణ తరగతులకు అర్హులన్నారు. మడకశిర నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

సోమందేపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ వెంకటలక్ష్మీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో కూలీలకు అత్యధిక పనిదినాలు కల్పించే దిశగా లక్ష్యాన్ని పెట్టుకోవాలన్నారు. ఒక్కొక్కరికి రూ.300వేతనం పడేలా చేయాలన్నారు. బడ్జెట్‌లో మండలాన్ని టాప్‌లో నిలిచేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీలో కంపోస్ట్ పిట్‌లు తవ్వించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, ఈఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అమరాపురం, మే 14(ఆంధ్రజ్యోతి): హేమావతి గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. సచివాలయం వెనుక భాగం, గొల్లహట్టి ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ వేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిసర ప్రాంతవాసులకు అవగాహన కల్పించారు.

జవాన్ ఆత్మకు శాంతి చేకూరాలని ర్యాలీ

పెనుకొండ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధంలో అమరుడైన మురళినాయక్ ఆత్మశాంతి చేకూరాలని రొద్దంలో శ్రీరామభక్తమండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. జైజవాన్ అంటూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు సర్వే

పెనుకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్, అలస్కో, సహిత విద్య ఉపాధ్యాయులు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం జిల్లా అధికారి ఆనంద్‌బాబు, సహిత విద్యా సిబ్బంది అంగనవాడీ కేంద్రాలలో ఆరేళ్లు పూర్తయిన చిన్నారులకు, ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం బోయపేట తదితర ప్రాంతాలలో సర్వేచేశారు. చిన్నారులు సదరు స్లాట్ బుక్ చేయించి సదరన్ సర్టిఫికెట్ వచ్చేలా చూస్తామన్నారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ-2 ఆనంద్‌బాబు సూచించారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి వ యసుకు తగినట్లు అంగనవాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ బడుల్లో చేర్పించడానికి చేపట్టిన డోర్‌టు డోర్ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప ర్యవేక్షించారు. ఈ సందర్భంగా తల్లి దండ్రులకు ప్రభు త్వం కల్పి స్తున్న వ సతులపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేక ఉపాధ్యాయులు లిం గ రాజు, మం జు ళకు పలు సూచనలు చేశారు.